క్లుప్తంగా

ఆధార్ మార్పులు, చేర్పులకు అవకాశం

సత్తెనపల్లి: ఆధార్‌లో మార్పులు, చేర్పులు, సవరణలకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. నాలుగు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ క్యాంపు కేటాయించిన సచివాలయాలలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. సత్తెనపల్లి మండలంలోని భట్లూరు, పెదమక్కెన గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ కార్డుల సవరణలతో పాటు కొత్త ఆధార్ కార్డుల జారీ కూడా అవకాశం కల్పించారన్నారు. ఆధార్ తీసుకొని పదేళ్లు పూర్తయినా ఒక్కసారి కూడా తమ ఫొటో, అడ్రస్ వంటివి అప్‌డేట్ చేసుకుని వారు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని కోరారు.

ఉన్నతిపై అవగాహన సదస్సు

నకరికల్లు: ఉన్నతి కార్యక్రమం ద్వారా నిరుద్యోగ యువతీయువకులకు ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎం రామకృష్ణ తెలిపారు. మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉన్నతి కార్యక్రమంపై బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్లలో ఆక్వాకల్చర్, ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో ఏరోనాటికల్, కోటప్పకొండలో కంప్యూటర్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తారని చెప్పారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి
– ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి



బెల్లంకొండ: వైద్యశాలకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో గల పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైద్యశాలలో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని పలువురు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. రికార్డులను పరిశీలించి పలువురు సిబ్బందిపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వైద్యశాలకు అవసరమైన సామాగ్రి కొనుగోలుకు, పలు వసతుల కల్పన కోసం తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో గ్రామసర్పంచి కరీముల్లా బాబూజీ, ఎంపీటీసీ మాదాసు రాంబాబు, వైద్యులు కె.వి.కోటేశ్వరరావు, అముసుధార్, పీహెచ్ఎన్ రాణి, హెచ్‌వీ బేగం, సూపర్‌వైజర్ బాషా, గాదె మిల్లు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

హోంగార్డు నాగరాజానాయక్ సస్పెన్షన్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న నాగరాజానాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ రవిశంకర్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్పీ బి.ఆదినారాయణ తెలిపారు. హోంగార్డు నాయక్ సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ వాహన డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి పోలీసులు దాడులు గురించి ముందస్తుగా సమాచారం చేరవేస్తున్నందుకు ఆయన పై క్రమశిక్షణ చర్యలు తీసుకునే క్రమంలో సస్పెండ్ చేసినట్లు వివరించారు.

రేపు పల్నాడు కళాక్షేత్రం ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: కళలకు కాణాచిగా పేరుపొందిన నరసరావుపేటలో పల్నాడు కళాక్షేత్రంను ఈనెల 22వ తేదిన ప్రారంభిస్తున్నట్లు కళాక్షేత్రం అడ్‌హాక్ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, ఎస్.ఎం.భాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్నాడుజిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కళల నిత్య సాధనల సమన్వయ కేంద్రంగా కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సంస్కృతి, సాహిత్యం, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, జానపదం, ఫిల్మ్ మేకింగ్ తదితర కళలను సాధన చేసేందుకు, ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చేందుకు కళాక్షేత్రం దోహదపడుతుందని స్పష్టం చేశారు. పల్నాడు బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కళాక్షేత్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ లోతేటి శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి అట్లూరి సుభాష్ దీప్తి తదితరలు పాల్గొంటారని తెలిపారు.

దండాలయ్యా ... ఉండ్రాళ్లయ్యా

- వాడవాడలా గణపతి నవరాత్రుల సందడి
- పలు మండపాల వద్ద అన్నసంతర్పణ

సత్తెనపల్లి: విఘ్నాలు తొలగించి విజయాలను ప్రసాదించే ఆది దేవుడు గణపతి నవరాత్రుల్లో భాగంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో, మండలంలోని పలు గ్రామాలలో వినాయకుని మండపాల్లో ప్రత్యేక పూజలు బుధవారం కొనసాగాయి. గణపతి నవరాత్రుల్లో భాగంగా ప్రతి వార్డులోనూ, ప్రతి గ్రామంలోనూ ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సత్తెనపల్లి మండలం కొమెరపూడిలోని వినాయక మండపాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సందర్శించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పూలమాలలు, దుశ్శాలువాతో ఆయనను కమిటీ సభ్యులు, నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో రైతు సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కరరెడ్డి, బాపత్తు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని రఘురాం నగర్ వినాయకుని గుడి వద్ద ఏర్పాటు చేసిన మండపంలో, గాంధీ బొమ్మల సెంటర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో, 22వ వార్డులో ఏర్పాటు చేసిన మండపంలో అన్నసంతర్పణ చేశారు. పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్‌లో అన్నసంతర్పణను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూదనరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆత్మకూడి వెంకట హరేరామ చెంచయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దేవతి సుబ్బారావు, విశ్వేశ్వరరావు, కొత్తా లక్ష్మయ్య పాల్గొన్నారు. 22వ వార్డులో శెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాగణపతి బొమ్మ దగ్గర అన్న సంతర్పణను కౌన్సిలర్ ఆకుల రమేష్ బాబు ప్రారంభించగా కౌన్సిలర్ శెట్టి ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు యాసారపు విజయ్ కుమార్, స్వామి, అంజిరెడ్డి, శ్రీను తదితరులు హాజరయ్యారు. 18వ వార్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మందడపు సాయి ఆధ్వర్యంలో 24,19 వార్డుల కౌన్సిలర్లు అచ్యుత శివప్రసాద్, అవ్వారు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, ఉల్లంగుల ప్రసాద్ బాబు, షేక్ నాగూర్ బాషా, తోట కృష్ణ తదితరులు పూజలో పాల్గొన్నారు. గాంధీ బొమ్మల సెంటర్‌లో వినాయకుని మండపంలో ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ కుటుంబ సభ్యులు పూజలో పాల్గొన్నారు. రఘు రాంనగర్‌లోని పృథ్వీ గార్డీనియా అపార్ట్‌మెంట్‌లో కమిటీ ప్రెసిడెంట్ చల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గణపతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కొమెరపూడిలో వినాయక మండపంలో మంత్రి అంబటి రాంబాబు పూజలు



కరెన్సీనోట్లతో దేచవరంలోని విఘ్నేశ్వరస్వామి



రఘురామ్‌నగర్‌లో పూజలు..

లక్ష్మీగణపతి అలంకారంలో..

నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరస్వామి లక్ష్మీగణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరస్వామి ప్రతిమను కరెన్సీనోట్లతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి భజనా కార్యక్రమంలో పాల్గొన్నారు.



పట్టణంలోని 18వ వార్డులో వినాయకుడికి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పట్టణంలోని గాంధీచౌక్ వద్ద పూజలందుకుంటున్న వినాయకుడు



పట్టణంలోని 22వ వార్డులో అన్నసంతర్పణను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ ఆకుల రమేష్‌బాబు



రఘురామ్‌నగర్‌లోని పృథ్వీ గార్డీనియా వద్ద వినాయకుని మండపంలో మహిళలు

పేదల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- కోనూరు, కస్తలలో 'మన కోసం మన శంకరన్న' గ్రామ సభలు

అచ్చంపేట: బలహీన, బడుగు వర్గాల అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని కోనూరు, కస్తల గ్రామాలలో 'మన కోసం – మన శంకరన్న' గ్రామ సభలు బుధవారం నిర్వహించారు. కోనూరులో నిర్వహించిన గ్రామ సభకు సర్పంచి నీలాంబరం అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామానికి వచ్చినప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకున్నట్లు చెప్పారు. వాటిన్నింటిని అధికారులతో సంప్రదించి పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా నివేశన స్థలాలు, పెన్షన్లు, రేషన్‌కార్డులు, పక్కా గృహాలు కావాలని గ్రామస్తులు అడిగారన్నారు. కొంతమందికి కొన్ని కారణాల వలన సంక్షేమ పథకాలు రాలేదని చెప్పారన్నారు. అవి ఎందుకు రాలేదో విచారించి అర్హతున్నవారందరికీ మంజూరు చేయడం జరిగిందన్నారు. అంతర్గత రహదారులు, సైడు డ్రెయిన్స్ నిర్మించినట్లు చెప్పారు. పరిష్కరించిన ప్రతి సమస్యను వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

కస్తలలో....

కస్తల పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన మన కోసం– మన శంకరన్న గ్రామసభలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు "నివేశన స్థల పట్టాలు, రేషన్ కార్డులు, పక్కాగృహ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో కొన్నిచోట్ల రోడ్లపై నీళ్లు నిలబడుతున్నాయని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. విద్యుత్‌లో వోల్టేజితో రాత్రిళ్లు లైట్లు వెలడం లేదని, విద్యుత్ మోటార్లు తిరగడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యేకి విన్నవించారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ వేసేందుకు విద్యుత్ అధికారులకు సూచనలు చేశారు. సభకు గ్రామ సర్పంచి షేక్ మాబూసుభాని అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్ పద్మాదేవి, ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, సొసైటీ మాజీ ఛైర్మన్ తుమ్మా చిన్నపరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు రామిశెట్టి రంగయ్య, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, లీడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, అచ్చంపేట సర్పంచి కంబాల వీరబాబు, బీసీ విభాగం జిల్లా కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు, కోనూరు ఎంపీటీసీ యంగ్రపలి నటరాజు పాల్గొన్నారు.



కస్తలలో గ్రామస్తులనుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకరరావు



ఊటుకూరులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ఊటుకూరులో..

ఊటుకూరు(క్రోసూరు): పెదకూరపాడు నియోజకవర్గంలో 40 ఏళ్లలో గత పాలకులు చేయలేని అభివృద్ధిని నాలుగేళ్లలో చేసి చూపించానని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం మండలంలోని ఊటుకూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం సందర్భంగా ప్రజలు ఇచ్చిన అర్జీలు ఎంత వరకు పరిష్కరించబడ్డయో లబ్ధిదారులను అడిగి తెలుసుకునేందుకు మన కోసం మన శంకరన్న కార్యక్రమం బుధవారం నిర్వహించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, లిఫ్టుఇరిగేషన్ స్కీం మరమ్మతులకు అంచనాలు తయారు చేయాలని అధికారులను కోరారు. ఊటుకూరులో రూ.14 కోట్లతో సంక్షేమఫలాలు అందిస్తే, రూ.6.80 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పెదకూరపాడు నియోజకవర్గానికి తలమానికం, ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ అయినటువంటి అమరావతి– బెల్లంకొండ డబుల్‌రోడ్డు పనులు శరవేగంగా చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి జెర్పిపోతు బుచ్చియ్య, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, ఏఎంసీ ఛైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వైస్ ఛైర్మన్ గార్లపాటి దాసు, పీఏసీఎస్ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, డాక్టర్ షరీఫ్, గ్రామమాజీ సర్పంచి జన్నవరపు శ్రీనివాసరెడ్డి, అల్లురెడ్డి, టి.ప్రభాకరరెడ్డి, వెంకటరెడ్డి , షోషల్‌మీడియా షేక్‌బాజీ, రవికిరణ్, గంజిమాల నాగేశ్వరరావు, ఎంపీడీవో బి.మహేష్, తహసీల్దార్ షేక్ జియావుల్ హక్, హౌసింగ్ ఏఈ వెంకట్రావు, ఉపాధిహామీ ఏపీఓ వెంకట్రావు పాల్గొన్నారు.

సత్తెనపల్లి చేరుకున్న సంక్షేమ పాదయాత్ర

సత్తెనపల్లి: పరిపాలనలో సంస్కరణలను తీసుకువచ్చి పేద వర్గాలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో మార్కాపురం యువకుడు షేక్ జిలాని బాషా 4,200 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని, నియోజకవర్గ పర్యటనలో ఆయనకు అండగా ఉంటామని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. జిలాని బాషా చేపట్టిన పాదయాత్ర బుధవారం సత్తెనపల్లి చేరుకున్న సందర్భంగా నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివ ప్రసాద్, నాయకులు షేక్ గని, తుమ్మల వెంకటేశ్వరరావు, బ్రహ్మారెడ్డి, రెడ్డిగూడెం కరీముల్లా పాల్గొన్నారు.

వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వీసీని బర్తరఫ్ చేయాలి

సత్తెనపల్లి: వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయ ఉప కులపతిని వెంటనే బర్తరఫ్ చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లెల్ల పాల్‌రాజ్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాల్‌రాజ్ మాట్లాడుతూ 54 వేల ర్యాంకు వచ్చిన వారికి రిజర్వేషన్ కేటగిరీలో, 60 వేలు ర్యాంకు వచ్చిన అభ్యర్థులకు ఓపెన్ క్యాటగిరిలో, సీట్లు కేటాయించటం దారుణం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బీఎస్పీ నియోజక వర్గ కార్యదర్శి కుక్కుమల్ల దేవానంద్, అంబేడ్కర్ యువజన సంఘం సత్తెనపల్లి మండల కార్యదర్శి గంగోలు రమేష్ బాబు, బీఎస్పీ పట్టణ కార్యదర్శి తల తోటి కోటేశ్వరరావు, అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నల్లూరి రవికుమార్, అంబేడ్కర్ యువజన సంఘం మండల ఉపాధ్యక్షుడు ఏకుల రాజు పాల్గొన్నారు.

గొర్రె పిల్లల అపహరణ

నకరికల్లు: గొర్రె పిల్లల అపహరణపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎ.బాలకృష్ణ అందించిన వివరాలు.. తెలంగాణకు చెందిన మోదీపురం చిన అప్పారావు, మరికొందరు కలసి గొర్రెలు మేపుకునేందుకు మండలంలోని కుంకలగుంట గ్రామంలోని పొలాలకు వచ్చారు. 19వ తేదీ రాత్రి చుట్టూ ఇనుపజల్లెడ ఏర్పాటు చేసి వాటి మధ్యలో గొర్రెపిల్లలను ఉంచి నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారిన తరువాత చూస్తే ఐదుగురికి చెందిన 17 గొర్రెపిల్లలు కన్పించడం లేదు. దీంతో అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

పలుదేవర్లపాడు(ముప్పాళ్ల): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ కోరారు. మండలంలోని పలుదేవర్లపాడు, నార్నెపాడు గ్రామాల్లో చేపట్టిన రీసర్వే ప్రక్రియను బుధవారం పరిశీలించారు. మొదటి విడతగా ఆరు గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ ప్రారంభమైందని, భూ యజమానులు తమ భూములకు సంబంధించిన ఆధారాలను సర్వే సిబ్బందికి అందించాలని కోరారు. వందేళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వే ప్రక్రియను చేపట్టిందని వివరించారు. సర్వే ఆఫ్ ఇండియా జాతీయ సంస్థ సహకారంతో ఆధునిక విధానంలో సర్వే జరుగుతుందని చెప్పారు. సర్వే జరిగే ప్రాంతంలోని రైతులకు మూడు రోజులు ముందుగానే నోటీసులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేసి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ సూచించారు. డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.



పలుదేవర్లపాడులో రీసర్వే ను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎం.భవానీశంకర్

టెన్త్, ఇంటర్ డ్రాప్‌అవుట్లను గుర్తించాలి

సత్తెనపల్లి: వివిధ కారణాలతో చదువును మధ్యలో మానేసిన పదో తరగతి, ఇంటర్ పూర్తి చేయని వారిని వలంటీర్ల సహకారంతో గుర్తించి టెన్త్, ఇంటర్‌లో వారికి అడ్మిషన్లు కల్పించాలని మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు కోరారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు ఏపీఓఎస్ఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.అక్బర్ అలీ మాట్లాడుతూ ఈ సువర్ణ అవకాశాన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చదువు మధ్యలో ఆపేసిన వారు వినియోగించుకోవాలని కోరారు. పల్నాడు ఏపీఓఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ కేఎం హుసేన్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్‌కి సంబంధించిన కోర్సులు సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. అక్కడ కూడా అడ్మిషన్ ఇప్పించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ఏ రాఘవేంద్రరావు, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఏ మాధవీలత, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఈ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

బొల్లాపల్లి: జగనన్న ఆరోగ్య సురక్షలో సచివాలయం పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి వ్యాధులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆక్టోబరు 3 నుంచి నిర్వహించే వైద్య శిబిరంలో చికిత్స అందజేయడం జరుగుతుందని వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి. వీర నరేష్ తెలిపారు. పేరూరుపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా సర్వే ప్రారంభమైందన్నారు. ప్రతి ఇంటికి వైద్య బృందం కంటి జబ్బులు, గర్భిణులు, ఐదు ఏళ్లలోపు చిన్నారులు వ్యాక్సినేషన్, సీనజనల్ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించడం జరుగుతుందన్నారు. ఏమైనా వ్యాధులు ఉన్న వారిలో షుగర్, బీపీ రోగులకు పరీక్షలు, టీబీ, జ్వరం వంటి జబ్బులకు పరీక్షలు చేసి అక్టోబర్ 3న ఈ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. చికిత్సలో భాగంగా నిర్వహించే వైద్య శిబిరంలో బొల్లాపల్లి, వెల్లటూరు పీహెచ్‌సీకి చెందిన ఇరువురు వైద్యులు, ప్రత్యేక వైద్య నిపుణులు ఇరువురు, సంబంధించిన నలుగురు వైద్యులతో శిబిరంలో వైద్య సేవలు ఉంటాయని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య నిపుణులతో కూడిన వైద్య బృందం గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందజేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ఈపూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఈపూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల హెచ్‌ఎం ఎస్.రామ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ తుర్లపాటి చౌదయ్య, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.అంకుల్ ప్రారంభించారు. పోటీల్లో ఈపూరు, ముప్పాళ్ల, ఇనిమెళ్ల, కొచ్చర్ల, కొండ్రముట్ల, బొగ్గరం జెడ్పీహెచ్ పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్ నుంచి బాలబాలికలు హాజరయ్యారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్‌బ్యాడ్మింటన్, యోగా తదితర క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు. జెడ్పీటీసీ చౌదయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఆడి మరిన్ని విజయాలను అధిరోహించాలన్నారు. అనంతరం ఆటల పోటీల సందర్భంగా ఈపూరు పాఠశాలకు చెందిన క్రీడాకారులకు ఉపాధ్యాయులు డి.సుబ్రహ్మణ్యం, వి.అనురాధ, ఏపీటీఎఫ్ యూనియన్ 1104 ఎస్ఆర్‌టీ అధ్యక్ష, కార్యదర్శులు, అంగలూరు సొసైటీ సిబ్బంది జి. శేఖర్ క్రీడాదుస్తులను అందజేశారు. కార్యక్రమాల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.వీరాంజనేయులు పాల్గొన్నారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

అచ్చంపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని హెచ్‌ఎం సీహెచ్ కల్యాణి తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూలు ఆవరణలో సేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు.